# నిప్పులేని పొగ

**(ఆంధ్రపత్రిక వీక్లీ దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన కథ)**

**సన్నగా చిటపట చినుకులు పడటం ప్రారంభించాయ్. పేకముక్కలు ప్రక్కనపడేసిబోయ్ తెచ్చిన వేడి టీ అందుకున్నాం. మేం నలుగురం శెలవు రోజుల్లో ఇలా రావు గారింట్లో సమావేశం అయి కాలక్షేపం చేయటం మా కలవాటు.**

**రావుగారు మా ముగ్గురి కంటే ఏడెనిమిది సంవత్సరాలు వయసులో పెద్ద. కాలేజీలో లెక్చరరుగా చేస్తున్నారు. పెళ్ళి చేసుకోలేదు. చిన్న ఫామిలీ పోర్షనులో అద్దెకుంటున్నారు.**

**మేం ముగ్గురం ఒక ఆఫీసువాళ్లమే. రమణకి రావుగారు దూరపు బంధువు. ఆ విధంగా మా స్నేహం కలిసింది.**

మేం కూర్చున్నది కటకటాల వరండా కాబట్టి రోడ్డు మీద వెళ్ళే వాళ్ళందరూ మాకు కనిపిస్తూంటారు. అప్పుడే ఒక అమ్మాయి చకచకా పరుగులాంటి నడకతో వెళ్ళింది. అమ్మాయిలను చూస్తే రాజుగాడి నోరూరుకోదు. ఏదో ఒకటి కామెంట్ చేస్తుంటాడు. అది వాడికి హాబీ. కానీ రావుగారి సమక్షంలో మాత్రం పెద్దమనిషి తరహాగానే వుంటాడు. ఆ రోజెందుకో మమూలు ధోరణిలోకి దిగిపోయాడు.

“ఆ అమ్మాయిని చూసి మీరంతా ఏమనుకుంటారు? వాన పెద్దదవుతుందేమోననే ఆదుర్దాతో ఇంటికి తొందరగా చేరాలని అలా హడావుడిగా వెళ్తోందనుకుంటారు. అవునా? కానీ అది కరెక్టుకాదు” అన్నాడు రాజు.

మళ్ళీ తనే “వాడెవడో గానీ చాలా అదృష్టవంతుడు” అంటూ నిట్టూర్చాడు.

“వాడెవడు మధ్యలో?” అడిగాను.

"ఇంకెవరు! ఈ అందమైన సాయంత్రాన్ని ఆ అమ్మాయితో పంచుకుంటున్న బాయ్‌ఫ్రెండు. ఆ నడకలో తొందర, ఆ మొహంలో ఆదుర్దా ఎందుకనుకున్నారు? చెప్పిన టైముకి చేరకపోతే, ఎదురు చూసిన ఆ ఫ్రెండు వెళ్ళిపోతాడేమోనని ఆ పరుగు!"

"బాయ్‌ఫ్రెండు దగ్గరకని ఆ అమ్మాయి నీకు చెప్పిందా?" వ్యంగ్యంగా రమణ అన్నాడు.

"ఇలాంటి విషయాలెవ్వరూ నీకూ నాకు చెప్పి, మైకులో ఎనౌన్సు చేసుకుంటూనూ వెళ్ళరు నాయనా! ఫేస్‌ని చూసి ఆ మనసులోని ఆలోచనని పసికట్టేయగలను. అదే నా ప్రత్యేకత. మీకూ నాకూ గల తేడా!" కాలరు ఎగరేసుకుంటూ ఫోజుగా అన్నాడు రాజు.

"రాజూ, ఆపుతావా ఇక ఆ అసందర్భ ప్రేలాపన!" ఉరిమినట్లే అన్న రావుగారి మాటలకు మేమంతా ఉలిక్కిపడ్డాం.

"ఏమిటిసార్! ఏదో సరదా సంభాషణకి మీరంత సీరియస్ అయ్యారేమిటి?"

"నువ్వు సరదా కోసమని విసిరిన మాట ఓ తూటాగా మారి ఓ నిండు బ్రతుకును బలి తీసుకునే అవకాశం వుందని నీకు తెలుసా?" కోపంగా రావుగారు అన్నారు.

"నేను ఇంటింటికి వెళ్ళి ఆ అమ్మాయి గురించి ప్రచారం చేస్తున్నానా? మన నలుగురిలో అనుకున్నాం. అంతే. ఆ అమ్మాయి బాధ పడుతుందేమో అనుకోవటానికి వినే అవకాశం కూడా లేదు కదా!" సంజాయిషీగా రాజు అన్నాడు.

"లేదు రాజూ, మనం విసిరే నింద నిప్పురవ్వలాంటిది. అది ఆరిపోవచ్చు. ఒకోసారి ఆరిపోకపోనూవచ్చు. ఆ చిన్న రవ్వే రాజుకుని ఓ నిండు బ్రతుకుని బూడిద చేయగలదు. ఓ కుటుంబాన్నే ఆహుతి చేయవచ్చు. మీలో రమణ, కృష్ణ ఇద్దరూ పెళ్ళి కావల్సిన వాళ్ళు. ఒకవేళ వీళ్ళిద్దరిలో ఎవరికైనా పెళ్ళిచూపుల్లో ఆ అమ్మాయి తటస్థపడితే, ఈ నాటి నీ మాటల ప్రభావం వీళ్ళపై వుండదా? 'ఏమో అనుమానం వున్న చోట రిస్క్ ఎందుకు తీసుకోవటం' అని కాదనుకుంటే, కుదరాల్సిన సంబంధం చెడిపోతే, ఆ అమ్మాయికి హాని జరిగినట్లు కాదా?"

"మీరేదో సినిమాల్లో జరిగే సంఘటనలు చెబుతున్నారు" తేలిగ్గా అనేశాడు రాజు.

ఎందుకో గాని రావుగారి మొహంలో అమితమైన ఆవేదన స్పష్టంగా కనబడింది.

"సినిమాల్లో కంటే కూడా నిజ జీవితాల్లో కొన్ని సంఘటనలు ఎంతో నాటకీయంగా జరుగుతుంటాయి ఒక్కోసారి. నా జీవితంలో జరిగిన దానినే మీకు చెబుతాను. మీరెన్నోసార్లు నేనెందుకు పెళ్ళిమానుకున్నానో చెప్పమని అడిగారు. నేను చెప్పలేకపోయాను. ఇప్పుడు సందర్భం వచ్చింది కాబట్టి చెబుతాను వినండి"

ఏదో పెద్ద కథే వుంది రావుగారి జీవితంలో అనుకున్నాను. రావుగారు చెప్పటం మొదలు పెట్టారు.

"అవి నేను ఎయిత్‌క్లాసు చదువుతున్న రోజులు. మా స్కూలుకి ఆ సంవత్సరం భాస్కరరావు గారనే మాష్టారు క్రొత్తగా వచ్చారు. వచ్చిన కొద్దిరోజులకే బాగా చెబుతారనే పేరు వచ్చింది. ఆయనెవరికీ ట్యూషన్సు చెప్పేవారు కాదు. మా నాన్న నన్ను వెంటబెట్టుకుని ఆ మాష్టారింటికి వెళ్ళి నాకు లెక్కలు, ఇంగ్లీషు చెప్పమని అడిగేసరికి ఒప్పుకున్నారు. ఆ రోజుల్లో మావూళ్ళో మా నాన్నే పెద్దరైతు క్రింద లెక్క. ఆ గౌరవంతో ఒప్పుకున్నారనుకుంటా కానీ ఫీజు తీసుకోవటానికి అంగీకరించలేదు.

ఎప్పుడైనా పళ్ళు, కూరగాయలు తీసుకెళ్ళి ఇస్తూండే వాడిని. దానికి కూడా మాష్టారు అస్తమానూ తేవద్దంటూ మందలించేవారు. ఆ రోజుల్లో భాస్కరం మాష్టారు వేసిన పునాదే నేను ఎమ్.కామ్. యూనివర్శిటీ ఫస్టున రావటానికి దోహదపడిందని చెప్పగలను. నాతోపాటుగా రోజూ మా చెల్లి కమల కూడా పుస్తకాలు పట్టుకుని వచ్చేది. మాష్టారి అమ్మాయి మాధవి కమల క్లాసుమేట్. ఇద్దరూ అప్పుడు ఆరో తరగతిలో వున్నారు. వీళ్ళిద్దరూ కాస్సేపు ఆడుకుని కాసేపు చదువుకుంటూండే వాళ్ళు. మాష్టారు లేనప్పుడు నేనూ వాళ్ళతో ఆటల్లో కలిసేవాడిని.

మాధవి తల్లి కామాక్షిగారు కూడా మమ్మల్ని ఆప్యాయంగా పలకరించి అప్పుడప్పుడు వాళ్ళింట్లో చేసిన పిండి వంటలు మాకు పెడుతూండేది. మా స్నేహం రెండేళ్ళు సాగింది. మా నాన్నకి బిజినెస్ చేయాలని బుద్ధి పుట్టింది. పొలమంతా కౌలుకిచ్చి మా మకాం రాజమండ్రికి మార్చేశాం. ఇక ఆ తర్వాత నేనూ వూరు వెళ్లలేదు. వాళ్ళని కలుసుకోలేదు. మాష్టారు కూడా ఇంకో రెండేళ్ళ తర్వాత ఆ వూరు నుండి వెళ్ళిపోయారని విన్నాను.

నేను ఎమ్.కామ్. వైజాగ్‌లో చదువుతున్న రోజుల్లో ఫ్రెండు పెళ్ళికని విజయవాడ వెళ్ళాను. అప్పుడే మళ్ళీ నాకు మాధవి తటస్థపడింది.

నేను తిరుగు ప్రయాణానికి బస్సు స్టాండుకు వెళ్ళాను. బస్సులో నుండి దిగి వచ్చిన మాధవి నన్ను గుర్తుపట్టి నా దగ్గరకు వచ్చింది. "మురళీ...ధర..రావు కదూ" అంది కొంచెం సంకోచంగా. అవునన్నట్లుగా తలాడించి "మాధవీ" అన్నాను.

ఒక్కసారిగా ఆ వదనంలోకి ఆనందోత్సాహం వెల్లువై వచ్చేసింది! "హమ్మయ్య! గుర్తుపట్టావు!" అంటూ పకపక నవ్వింది. ఒక నిముషంలోనే ఎక్కడ నుండి, ఎక్కడికి, ఎందుకు లాంటి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టుకుని తన వివరాలన్నీ కూడా గడగడా చెప్పేసింది.

మా వూరు వదిలి పెట్టినప్పటి నుండీ వాళ్ళు విజయవాడలోనే వుంటున్నారట. మాష్టారు మరొకరితో కలిసి స్వంతంగా ఓ కాన్వెంట్ నడుపుతున్నారట. తర్వాత బస్సుకు వెళ్ళొచ్చులే అంటూ నా ప్రయాణాన్ని వాయిదా వేయించి బలవంతం చేసి వాళ్ళింటికి తీసుకెళ్ళింది.

వాళ్ళింటిలో అందరూ ఆప్యాయంగా పలకరించి వివరాలడిగి తెలుసుకున్నారు. మాధవి టిఫిన్ ప్లేటు నా చేతికిచ్చి చిన్నప్పటి సంగతులెన్నో గుర్తు చేస్తూ గలగలా మాట్లాడింది. వాటిలో నాకు చాలా గుర్తులేవు కూడా.

"నన్ను ఏమని పిలిచే వాడివో గుర్తుందా?" అడిగింది.

"మద్దూ అనేగా" అన్నాను.

"ఆ పిలుపు నీ ఒక్కడికే ప్రత్యేకం మరి!" అంటూ నవ్వింది. ప్రతీ చిన్న విషయానికి పకపక నవ్వటం మాధవి అలవాటు. అది మారినట్లు లేదు. మాధవిని ఎవరైనా 'పేరేమిట'ని చిన్నప్పుడు అడిగితే 'మద్దూ' అని చెప్పేదట. ఆ సంగతి వాళ్ళమ్మగారు మాటల మధ్యలో నాకు చెప్పారొకసారి. అప్పటి నుండీ అంతా 'మధూ' అని పిలిచినా నేను మాత్రం సరదాగా 'మద్దూ' అని పిలిచేవాడిని.

"మురళీ, అప్పుడు మనిద్దరి మధ్యా ఒక బంధం ఏర్పరిచావు, గుర్తుందా?" మెరిసే కళ్ళతో అడిగింది. నిజానికి నాకేం గుర్తులేదు. కానీ మొహమాటంగా తలాడించాను.

“నేను మాత్రం నిన్ను ప్రతీ రోజూ గుర్తుచేసుకుంటూనే వుంటాను. ఎప్పుడైనా కనుపిస్తే ఎంత బాగుండును! ఎక్కడున్నావో! అని మనసులో అనుకుంటూండే దాన్ని. ఇన్నాళ్ళకి కనుపించావ్!” ఆనందాన్ని మాటల్లో, చూపుల్లో వ్యక్తపరుస్తూ అంది.

నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. మాధవి నన్నింతగా గుర్తు పెట్టుకుందా? ఆ చిన్ననాటి స్నేహానికి తన మనసులో ఇంత విలువుందా?! ఆ రెండేళ్ళ స్నేహంలో ఆటల మధ్య తనంటే ఇష్టమనిగానీ, పెద్దయ్యాక పెళ్ళి చేసుకుంటానని గానీ ఏమైనా చెప్పానా? నాకేం గుర్తురాలేదు. ఒకవేళ అన్నా, దానికంత ప్రాముఖ్యత నిచ్చి కథల్లోలా నన్ను ఇంతగా గుర్తుపెట్టుకుందా? నాకు ఆశ్చర్యంగా వున్నా అంతకు మించి ఆనందంగానూ వుంది.

మాధవి లాంటి అందమైన అమ్మాయి నాతో ఇంత సన్నిహితంగా, ఆత్మీయంగా వుండటం అదే మొదటిసారి. ఆ కాస్సేపు వాళ్ళింట్లో గడిపిన సమయం నాకెంతో విలువైనదిగా అపురూపంగా అనిపించింది! మాధవి చిన్నప్పుడు బొద్దుగా, తెల్లగా వుండేది. ఇప్పుడు సన్నగా, పసిమి ఛాయలో చెక్కిన శిల్పంలా వుంది.

వచ్చేస్తోంటే ‘మళ్ళా వస్తావా’ అనడిగింది. ‘అలాగే’ అంటే ‘ప్రామిస్’ అని చెయ్యి చాపింది. ఆ చేతిలో చేయి వేస్తుంటే నా మనసు చిత్రంగా స్పందించింది!

వైజాగ్ వచ్చాక పరీక్షలకు సీరియస్‌గా చదువుతున్నా, ఫ్రెండ్సుతో బాతాఖానీ కొడ్తున్నా, ఒంటరిగా కూర్చున్నా... ఎప్పుడూ మాధవి ఆలోచన నీడలా నన్ను ఆక్రమించుకుంటూనే వుండేది. ‘ఆ పిలుపు నీకే ప్రత్యేకం’ అని చెబుతున్నప్పుడు మాధవి కళ్ళల్లోని మెరుపు జ్ఞాపకం వచ్చి నన్ను మురిపించేది. ‘ప్రామిస్’ అంటూ ఆ చేతిలో చేయి వేసినప్పుడు కలిగిన పులకింత పదే పదే గుర్తుకొచ్చేది!

ఎలాగైనా మాధవినే వివాహం చేసుకోవాలని మనసులోనే నిశ్చయం చేసుకున్నాను. మాధవికి నేనంటే ఎంత ఇష్టమో మాటల్లో వెల్లడైంది. ఇక అమ్మా నాన్నలతో పోరాడి అయినా ఒప్పించగలననే ధైర్యముంది. అందుకే ఫైనల్ ఎగ్జామ్స్ అవగానే విజయవాడ వెళ్ళి మాష్టారి అనుమతి తీసుకోవాలనుకున్నాను.

నేను ఊహల్లో ఎంతో దూరం వెళ్ళిపోయాను. మాధవి సమక్షంలో ఎవరికైనా మామూలు విషయాలు గుర్తురావు. మల్లెపూలు, మంచిగంధం, వెన్నెల, విరజాజులు లాంటివి తప్ప! అలాంటి మాధవితో జీవితాన్ని పంచుకోవటమంటే మామూలు అదృష్టం కాదు. ఆదొక అపురూపమైన వరం! ఆ మాధవితో నా జీవితం ప్రతీరోజూ పండుగలా గడిచిపోతుంది! మా ఇల్లు పకపక నవ్వులతో పాలవెల్లిలా వుంటుంది. అనుక్షణం ఇవే ఆలోచనలవటం వలన మాధవితో నాకేదో గాఢమైన అనుబంధం ఏర్పడిపోయినట్లుగా అనిపించేది!

ఎగ్జామ్స్ అవగానే విజయవాడ వెళ్ళాను. ఏదైనా చిన్న బహుమతి కొనుక్కు వెళ్దామని షాపింగు సెంటరుకి వెళ్ళాను. అక్కడ భాస్కరం మాష్టారు కనుపించారు. మాష్టారు చెప్పిన వార్త పిడుగుపాటులా తగిలింది!

మాధవికి పెళ్ళి నిశ్చయమైందట! ఆరోజు ఉదయమే పెళ్ళి చూపులు జరిగాయి. అమ్మాయి నచ్చిందని ముహూర్తాలు పెట్టుకుందామని చెప్పి వెళ్ళారుట. నాకు మతిపోయినట్లయింది. మంచి సంబంధం కుదిరిందంటూ మాష్టారు ఆనందంగా చెప్పుకుపోతున్నారు.

"పర్వతా పార్థసారధి గారంటే బాగా పేరున్న లాయరు. వాళ్ళ రెండో అబ్బాయి కేశవరావు బి.కామ్. పాసయి బ్యాంకులో పని చేస్తున్నాడు." మాష్టారి మాటల్లో నా చెవులో పడ్డ వివరాలివి. అన్యమనస్కంగా విని ఇక వెళ్తానని చెప్పి స్టేషనుకి వచ్చేశాను.

ఇంత తొందరగా మాధవికి పెళ్ళి నిశ్చయమతుందని నేనూహించలేదు. మాధవి అయినా అభ్యంతరం ఎందుకు చెప్పలేదు? నా పిచ్చి ఆలోచనకి నాకే నవ్వు వచ్చింది! నేనేమీ చెప్పకుండా ఎలా చెబుతుంది? నేను వస్తానో, రానో అసలు అంగీకరిస్తానో, లేదో ఏమీ తెలియకుండా వచ్చిన సంబంధాన్ని ఎలా కాదన గలదు? ఒక వేళ అభ్యంతరం చెప్పినా పెద్దవాళ్ళు వూరుకుంటారా!

కృంగిపోయిన మనసుతో ట్రైనెక్కాను. నా ప్రక్కన కూర్చున్నాయన జిప్‌బాగ్ ఆయన చేతిలో నుండి జారి నా కాళ్ళముందు పడింది. అది తీసి అయనకి అందిస్తోంటే దాని మీదున్న పేరు కనుపించింది. పి.పార్థసారధి! ఉలిక్కిపడ్డాను. అప్పుడు నా ప్రక్కన కూర్చున్న వాళ్ళని గమనించాను. ఎదురుగా కూర్చున్నావిడ 'కేశవా, ఆ బుట్ట ఇటు ప్రక్కపెట్టరా' అంది. ఆ ప్రక్కన కూర్చున్న యువకుడితో. నా అనుమానం తీరిపోయింది! మాధవిని చూసి నిశ్చయం చేసుకున్న పెళ్ళివారు వీళ్ళేనన్నమాట.

ఆ అబ్బాయిని పరీక్షగా చూసాను. చాలా సాదాసీదా వ్యక్తిలా కనుపించాడు. అప్పుడే నా మనసులో ఒక ఆలోచన వచ్చింది. భగవంతుడే నాకీ అవకాశాన్ని కల్పించాడు కాబోలు అనుకున్నాను! లేకపోతే వీళ్ళు నాకిలా తటస్థపడటం చిత్రంగా లేదూ! తప్పుడు ఆలోచనలు చేసే వాళ్ళంతా ఇలాగే సమర్థించు కుంటారనుకుంటా.

తాత్సారం చేయకుండా నిముషాల్లో సంభాషణని సిద్ధం చేసుకున్నాను మనసులోనే. యాధాలాపంగా అన్నట్టుగా వాళ్ళతో సంభాషణలోకి దిగాను. నేనేం చెప్పదలుచుకున్నది చెప్పేశాను. నిప్పురవ్వని విసిరేశానన్నమాట!

నేను సంభాషణని ఎంత పకడ్‌బందీగా నడిపించానంటే ఏదీ నేను చెప్పినట్లుగా కాకుండా, వాళ్ళడిగిన ప్రశ్నలకే సమాధానాలు చెప్పినట్లుగా వాళ్ళ మనసుల్లో విషబీజం నాటాను!

నేను విజయవాడకి మా పెదనాన్నగారి అబ్బాయికి వచ్చిన సంబంధం గురించి ఎంక్వైరీకి వచ్చినట్లు, ఆ అమ్మాయికి ఇంతకు ముందే ప్రేమ వ్యవహారాలున్నాయని తెలిసినట్లు పేర్లతో సహా చెప్పాను. ఈ రోజుల్లో సినిమాలు, నవలలు ఇలా కాలేజీ అమ్మాయిల్ని పెడత్రోవ పట్టిస్తున్నాయనీ, ఆ అమ్మాయిని చూస్తే ఎవరైనా ఎంతో అమాయకురాలను కుంటారనీ ఏవేవో చెప్పాను పెద్దమనిషి తరహాగా.

నా మాటల ప్రభావం వాళ్ళమీద బాగానే పడిందని వాళ్ళ ముఖకవళికల్ని బట్టి గ్రహించగల్గాను. నేను పేపరు అడ్డం పెట్టుకుని, వాళ్ళని గమనిస్తూనే వున్నాను. వాళ్ళు అప్పుడే గుసగుసగా చర్చ మొదలు పెట్టారు. అంటే సగటు మనుష్యుల మనస్తత్వం ఎలా వుంటుందని ఊహించానో సరిగ్గా అలాగే జరుగుతోంది! కేశవరావు తల్లి కాబోలు మెల్లగా అంటోంది 'నిప్పులేకుండా పొగవస్తుందా!" అని!

చూద్దాం నా అదృష్టం ఎలా వుందో అనుకున్నాను. ఈ సంబంధం చెడిపోతే మాధవిని నేను దక్కించుకోగలుగుతాను. వాళ్ళు, మళ్ళీ వాకబు చేసుకుని పెళ్ళికి సిద్ధపడితే 'నా అదృష్టమింతే' అని వూరుకోవాలి అనుకున్నాను.

నేను ఇంటికి వెళ్ళేసరికి నాన్నగారికి సీరియస్‌గా వుంది. ఆపరేషనుకి మద్రాసు తీసుకెళ్ళాలన్నారు. ఆ గొడవలో పడిపోయాను. మద్రాసులో రెండు నెలలున్నాం. కానీ ఇంటికి వచ్చిన పదిరోజులకే నాన్న చనిపోయారు. ఆ గొడవల్లో తాత్కాలికంగా మాధవి విషయం మరుగునపడింది.

నాలుగైదు నెలలు గడిచాక విజయవాడ వెళ్ళాను. మాష్టారింటి దగ్గరే వున్నారు. మాధవికి బి.కామ్. పూర్తయింది. టైపు నేర్చుకుంటోందట, ట్యూషనుకి వెళ్ళింది. ఇంకా రాలేదు. నా వివరాలడిగారు. ఉద్యోగ ప్రయత్నంలో వున్నానని చెప్పాను. మాధవి పెళ్ళి విషయం కదిపాను.

మాష్టారు మెల్లగా నిట్టూర్చారు. పెళ్ళి ఆగిపోయిందనే విషయం చెబుతోంటే ఆయన కంఠం పూడుకుపోయింది. ఆ పెళ్ళి వారికి విజయవాడలో బంధువులున్నారట. ఈ సంబంధాన్ని కాన్సిల్ చేసుకుంటున్నట్లు వాళ్ళ ద్వారా తెలియచేశారు. అమ్మాయి ప్రవర్తన గురించి వాళ్ళకి ఎవరో ఏదో చెప్పారట. అందుకని మానుకుంటున్నట్లుగా చెప్పారు. ఆ పుకారు అలా అలా వ్యాపించి మళ్ళీ వచ్చిన రెండు మూడు సంబంధాలను కూడా చెడగొట్టింది.

నేను నిర్ఘాంతపోయాను! దేనికైనా ఇంత తక్కువ వ్యవధిలో ఇంత అభివృద్ధి జరుగుతుందా? జరగదు. కానీ ఆడదాని విషయంలో అపనింద మాత్రం అంచెలంచెలుగా నిముషాలలో అందరికీ చేరిపోతుంది! అందమైన అమ్మాయి అయితే ఆ అపనింద సిమెంటు తాపడంలా మరీ గట్టిగా బిగుసుకుపోతుంది.

మాష్టారు తన ఆవేదనవంతా మాటలలో వెళ్ళగ్రక్కుతోంటే, ఆ మాటలు నాకు సమ్మెట పోటుల్లా తగిలి విలవిలలాడిపోయాను. పెళ్ళి చెడిపోతుందని అనుకున్నానేగాని మాధవికి చెడ్డ పేరు ఇంతగా అందరిలో పాకిపోతుందని అనుకోలేదు. మాష్టారు ఎవరికీ చెప్పుకోలేకపోయిన ఆవేదనని నాతో పంచుకుంటూంటే సిగ్గుతో లోలోన కుమిలిపోయాను! నేనెంత తెలివి తక్కువగా ప్రవర్తించానో అర్థమైంది. ఇక ఆలస్యం చేయకుండా మాధవికి నా నిర్ణయాన్ని తెలిపి అందరి ఆమోదం తీసుకోవాలి అనుకున్నాను.

రోజూ 6 గంటలకి ఇంటికి వచ్చేసేదట. ఆ రోజు ఎనిమిది గంటల వరకూ రాలేదు. మాధవిని కలిసేవెళ్తానని చెప్పి ఎదురు చూస్తూ కూర్చున్నాను. మాష్టారి గదిలో పుస్తకాలు తిరగేస్తున్నాను. కామాక్షమ్మగారు పదిసార్లు అనుకుంది ఇంకా రాలేదేమిటా అని.

ఇంతలో మాధవి వచ్చింది. అప్పటి వరకూ ఆదుర్దాగా ఎదురు చూసిన కామాక్షమ్మగారు అసహనం పట్టలేకపోయినట్లుంది. కొంచెం గట్టిగానే మందలించింది.

"అసలే రోజులు బాగాలేవు. ఇదిగో పుట్టిందంటే, పురుగులు పట్టిందనే మాయదారి లోకంలో బ్రతుకుతున్నప్పుడు మన జాగ్రత్తలో మనం వుండాలి".

"రాణీబర్త్‌డే అంటూ బలవంతం చేస్తేనూ..." మాధవి మెల్లగా చెప్పటం వినిపించింది.

"చాల్లే! వచ్చిన చెడ్డపేరుకి తగ్గట్లుగా నువ్విలా రాత్రిపూట షికార్లు కూడా వెలగబెడితే, నలుగురిలో మొహాలు చూపించలేక మేం కట్టగట్టుకుని గంగలో దూకాలి!" కామాక్షమ్మగారి దూకుడుకి నేను నిర్ఘాంతపోయాను. ఏం చేయాలో తోచని స్థితిలో అలాగే కొద్ది సేపుండిపోయాను.

మాష్టారు మెల్లగా మాధవికి నేను వచ్చి ఎదురు చూస్తున్న విషయం చెప్పటం వినిపించింది. కన్నీళ్ళను తుడుచుకుంటూ మాధవి నేనున్న గదిలోకి వచ్చింది. నన్ను చూడగానే ఆ దుఃఖం మరింత విజృంభించింది.

"ఊరుకో మాధవీ... మాష్టారు చెప్పింది విని నేను చాలా బాధపడ్డాను. లోకంలో ఇంతటి మూర్ఖులుంటారని ఈ రోజు వరకు నాకూ తెలియదు. జరిగిందానికి విచారించి లాభంలేదు. నీ అనుమతి తీసుకుని నేను మాష్టారితో మన పెళ్ళి గురించి మాట్లాడుదామనుకుంటున్నాను. మా

అమ్మ వైపు నుండి ఏ అభ్యంతరం వుండదు. అంతా నా ఇష్టమే" నా ధోరణిలో చెప్పుకుపోతున్న నేను మాధవిని చూసి షాక్‌తిన్నాను. ఏదో వినకూడని భయంకరమైన వార్త వింటున్న దానిలా నిలువుగుడ్లేసుకుని నావైపు చూస్తోంది! నేనూహించినట్లుగా ఆనందం కనుపించలేదు సరికదా ఎంతకంత వింతగా చూస్తోంది?! నాకేం అర్థంకాలేదు.

కళ్ళ నుండి ఏకధారగా జారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ బొంగురుపోయిన కంఠంతో అంది. "మురళీ రేపు ఉదయం ఒకసారి రా మా ఇంటికి. ఇప్పుడు నేనేం మాట్లాడలేను" ఆ గదిలో నుండి రివ్వున వెళ్ళిపోయింది.

ఆ రాత్రికి తెలిసిన ఓ ఫ్రెండు గదిలో పడుకున్నాను. రాత్రంతా పీడకలలే! మాధవి ఎందుకంత ఆశ్చర్యపోయింది? నన్ను ప్రేమించిన మాట నిజం కాదా! ఎంత ఆలోచించినా నాకేం అర్థంకాలేదు. అప్పటి వరకూ మాధవిని నేనే పెళ్ళి చేసుకోదలిచాను. కాబట్టి నేను వేసిన నిందకి ఏదో మనసులో ఒక మూల సంకోచంగా వున్నా పెద్దగా బాధపడలేదు. తెల్లారే వరకూ నా మనస్థితి ఎలా వుందో మాటల్లో చెప్పలేను.

ఉదయాన్నే మాధవి ఇంటికి వెళ్లాను. వెళ్ళేవరకూ ఏం ఆలోచించుకుందో, ఏం చెబుతోందోననే ఆదుర్దాతోనే గడిపాను.

నే వెళ్ళేసరికి ఏముంది! అంతా ముగిసిపోయింది!

మాధవి ఆత్మహత్య చేసుకుందట!

నవనాడులూ కృంగిపోయిన వాడిలా కూలిపోయాను! ఇందుకేనా మాధవి నన్ను రమ్మన్నది! మాష్టారి పేర ఒకటి, నా పేర ఒకటి రెండు ఉత్తరాలు మాధవి గదిలో టేబుల్‌పై ఉన్నాయట.

ఎవరో నా పేర వున్న కవరును నాచేతిలో పెట్టారు. అందులో మాధవి నాకు ఏం వ్రాసిందో తెలుసా?

మురళీ

మన మధ్యనున్న అనుబంధాన్ని మర్చిపోయావా లేక ఈ పుకార్లు వల్ల నాకు పెళ్ళి కాదేమోనన్న భయంతో, జాలితో చెల్లినే పెళ్ళి చేసుకోవటానికి సిద్ధపడ్డావా?

మురళీ, ఆ రోజు నీకు గుర్తు లేదేమో కానీ నా మనసులో మరుపుకు రాకుండా నిల్చిపోయిన రోజది! నేను స్కూలు నుండి ఇంటికి వస్తూ దారిలో వున్న మాధవయ్యగారి మామిడి తోటలో ఎవరూ లేకపోవటం చూసి నాలుగు కాయలు కోసేశాను గబగబా. వచ్చెయ్యబోతోంటే కాపలా మనిషి చటుక్కున వెనక నుండి వచ్చి పట్టుకున్నాడు. 'ఎవరూ లేకుండా చూసి కాయలు తెంపుకుపోవటమేనా, చెట్టుకు కట్టేస్తానుండు' అంటూ బెదిరించేసరికి భయపడిపోయాను. ఏడుపు ఒక్కటే తరువాయిగా వుంది నాపని.

అప్పుడే నువ్వు అటుగా వచ్చావు. చూసి "వీరయ్యా ఆ అమ్మాయి మా చెల్లాయి. ఏమిటి బెదిరిస్తున్నావు?" అనడిగేసరికి వాడు వదిలి పెట్టాడు. "అయ్యో నాకు తెలవలేదు. రాఘవయ్యగారి అమ్మాయినని చెప్పవేంటి తల్లీ" అన్నాడు. బయటకు వచ్చాక "భలే మస్కా కొట్టించాను గదూ" అని నువ్వు నవ్వావు. అతను ఆ వూరికి క్రొత్తగా వచ్చాడు. అంతకు ముందు రోజే మాధవరావు గారు పంపితే మీ ఇంటికి రావటం వలన నువ్వు తెలుసని చెప్పావు.

తోబుట్టువులు ఎవరూ లేకపోవటం వల్లనేమో నువ్వు అనుకోకుండా ఏదో ఆపద్ధర్మంగా 'మా చెల్లాయి' అని చెప్పినా ఆ మాట నా పసి మనసుపై ఎంతో ప్రభావం చూపింది. "మురళీ నువ్వు నిజంగా నాకు అన్నయ్యవైతే ఎంత బాగుండును", అన్నాను. "ఇప్పుడైతే మాత్రం ఏం, నువ్వు నా చిన్న చెల్లాయివి" అన్నావు. నేను ఆనందంగా 'ప్రామిస్' అంటూ చేయిచాపితే 'ప్రామిస్' అంటూ నా చేతిలో చేయి వేశావు. అప్పటి నా ఆనందం మాటల్లో చెప్పలేనిది!! నిన్ను అన్నయ్యా అని పిలవాలనే కోరికున్నా కొత్తదనం వల్ల ఎప్పుడూ పిలవలేకపోయాను. కానీ మనసులో మాత్రం మరి మరి అనుకుని మురిసిపోయే దానిని!

మీరూ, మేమూ ఆ వూరు విడిచి పెట్టేశాం. కానీ నా మనసులో మాత్రం ఆ తీయని జ్ఞాపకం వుండిపోయింది. ఎప్పుడైనా కనుపిస్తే బాగుండునని అనుకుంటూండే దానిని. అలాగే కనుపించావు.

ఈ మధ్య జరిగిన విషయాల వల్ల అమ్మా నాన్న ఎంతో కృంగిపోయారు. దానికి నేనేం చేయను మురళీ! నిప్పు లేకుండానే పొగను పుట్టించగల పుణ్య పురుషులూ, మంటల్లేకుండానే జీవితాలను మసి చేయగల మహానుభావులూ ఉన్న పవిత్రదేశం మనది!

చావెపుడూ సమస్యలకి పరిష్కారం కాదని, ఆత్మహత్యలు చేసుకోవటం పిరికి వాళ్ళు చేసే పని అని నమ్మేదాన్ని. కానీ చివరకు నాకూ అదే దారి గతయింది!

నా కొచ్చిన చెడ్డపేరు వల్ల ఎంతగా నా తల్లిదండ్రులు కృంగిపోయారో కళ్ళారా చూస్తూ మొండిగా బ్రతకటం నావల్ల కాకపోయింది. నిన్న నాన్న నీ ముందు తన వ్యధని వెళ్ళగ్రక్కి వుంటారు. అమ్మ ప్రవర్తన చూసావు. అందుకే చెల్లెలనే అనుబంధాన్ని ప్రక్కకు నెట్టి పెళ్ళికి సిద్ధపడ్డావుగదూ! నా బ్రతుకింత అపహాస్యం అయిపోయిందనే ఆలోచనే నా మనసు నెక్కువగా కృంగదీసింది. అందుకే శాశ్వతంగా శెలవు తీసుకోదలచుకున్నాను.

ప్రతీరోజూ బాధ కలిగిస్తున్నాను బ్రతికుండి నా తల్లిదండ్రులకి. పిల్లలు తల్లిదండ్రులకి ఆనందం కలిగించాలే కానీ శిక్షగా మారకూడదు. అందుకే నేనీ నిర్ణయానికి వచ్చాను.

మురళీ అన్నయ్యా, శెలవ్. – నీ మద్దూ

మాధవి తల్లిదండ్రుల రోదననని విని భరించే స్థితిలో లేను నేను. నేను ఇంటికి ఎలా వచ్చిపడ్డానో నాకే తెలియదు. నెల్లాళ్ళు మంచంపట్టాను. ఎవరికైనా శత్రువుల వల్ల అపకారం జరుగుతుంది. కానీ మాధవికి మాత్రం ఆత్మీయుడి ననుకునే నా వల్లే జరిగింది! ఏం చేయను! సదిదిద్దుకోలేని తప్పు అది!"

రావు గారి కంఠం బొంగురుపోయింది. మా చెల్లెలే ఆత్మహత్య చేసుకుందన్న విషయం విన్నట్లుగా మా గుండెలు బరువెక్కాయి. పశ్చాత్తాపం నిండిన గొంతుతో రాజు అన్నాడు.

"సారీ సార్! నేను మీకు మాటిస్తున్నాను. తెలియని విషయాన్ని తెలిసినట్లుగా ఇక ముందెప్పుడు ప్రగల్భాలు పలకను. ఎవరి గురించి చులకనగా మాట్లాడను."

ఆంధ్రపత్రిక వీక్లీ. 4, నవంబరు, 1988.